# మోసపూరిత హామీలను నమ్మొద్దు



జహీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

- కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ పథకాలు ఆచరణలో అమలు సాధ్యం కావు
- తెలంగాణ అభివృద్ధిని బీజేపీ గుర్తించదు
- ఎన్నికల్లో మోసకారి పార్టీలకు ఓటమి తప్పదు
- 7న జహీరాబాద్‌లో ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు పర్యటన
- జహీరాబాద్‌లో 20 వేల మందితో భారీ సభ
- హోతి(కే)లో డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీ
- 3 వేల మందికి గృహలక్ష్మి పత్రాల అందజేత
- 'బేవరేజెస్' మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్పుల నరోత్తం
- పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ శివకుమార్

జహీరాబాద్, అక్టోబర్ 5 : రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త దేవీప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. గురువారం జహీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఏర్పుల నరోత్తం, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌తో కలిసి దేవీప్రసాద్‌రావు విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 7న జహీరాబాద్ నియోజకవర్గంలో మంత్రి హరీశ్‌రావు పర్యటిస్తారని తెలిపారు. జహీరాబాద్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభించి, లబ్ధిదారులతో గృహప్రవేశం చేయిస్తారన్నారు. హోతి(కే) గ్రామంలో ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించినట్లు తెలిపారు. జహీరాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. ఆచరణలో అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శించారు. తెలంగాణ అభివృద్ధిని బీజేపీ జీర్ణించుకోవడం లేదన్నారు. మంత్రి హరీశ్‌రావు పర్యటనకు భారీసంఖ్యలో ప్రజలను సమీకరించాలని బీఆర్‌ఎస్ నాయకులకు సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీ ని ఆశీర్వదించి, భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

**దళితుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి**

**- రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఏర్పుల నరోత్తం**

సీఎం కేసీఆర్ హయాంలో దళితులు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించారని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఏర్పుల నరోత్తం తెలిపారు. తొమ్మిది సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం దళితుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన ప్రతి ఒకరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు వివరించారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి ఎస్సీ కార్పొరేషన్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నదన్నారు. ఝరాసంగం మండలం బిడెకన్నె గ్రామంలో ఎస్సీ లబ్ధిదారులు వ్యవసాయం చేయడానికి బోర్లు వేయించామన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు.

**మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి**

**- రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ తన్వీర్**

మైనార్టీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ తన్వీర్ తెలిపారు. మైనార్టీలు విద్యపరంగా అభివృద్ధి చేసేందుకు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి, ఇంగ్లిషు మీడియం విద్యాబోధన చేస్తున్నారన్నారు. ఏ రాష్ట్రంలో మైనార్టీలకు విద్యాబోధన సక్రమంగా లేదని, తెలంగాణలో నాణ్యమైన విద్యాబోధన లభిస్తున్నదన్నారు. మంత్రి హరీశ్‌రావు సహకారంతో జహీరాబాద్ నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. గత ప్రభుత్వాలు మైనార్టీల సంక్షేమాన్ని, అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. మైనార్టీ పేదలను ఆర్థికంగా అందుకోవడానికి షాదీముబారక్, కల్యాణ లక్ష్మితోపాటు రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తున్నదన్నారు.

**20 వేల మందితో భారీ బహిరంగ సభ**

**- డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్**

జహీరాబాద్ పట్టణంలో 20 వేల మందితో భారీ సభ నిర్వహిస్తున్నామని డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్ తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు లబ్ధిదారులకు వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందజేస్తారని తెలిపారు. మంత్రి హరీశ్‌రావు ఝరాసంగం మండలం ఎల్గోయి నిమ్జ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారని వివరించారు.

**మంత్రి హరీశ్‌రావు పర్యటన వివరాలు..**

ఝరాసంగం మండల కేంద్రంలో ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారనితెలిపారు. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో నిమ్జ్‌కు 2.30 గంటలకు చేరుకుంటారన్నారు. ఝరాసంగం మండలం బిడెకన్నె గ్రామంలో లబ్ధిదారులకు వ్యవసాయ భూముల పట్టాలను పంపిణీ చేస్తారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ మంజూరు చేసిన బోర్లను ప్రారంభిస్తారన్నారు. బిడెకన్నె గ్రామంలో 143 ఎకరాల భూమికి సంబంధించి 96 మందికి పట్టాలు అందజేస్తారని వివరించారు. హోతి(కే) శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను లబ్ధిదారులకు అందజేసి, గృహ ప్రవేశాలు చేయిస్తారని తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని 3 వేల మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి మంజూరు పత్రాలు పంపిణీ చేస్తారన్నారు. గృహలక్ష్మి పథకానికి రూ. 90కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రూ. 10కోట్ల నిధులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రారంభిస్తారన్నారు. జహీరాబాద్ మున్సిపాలిటీకి గతంలో సీఎం కేసీఆర్ రూ. 50 కోట్లు మంజూరు చేశారని, ప్రస్తుతం మంత్రి హరీశ్‌రావు కృషితో సీఎం కేసీఆర్ మరో రూ. 30 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ మేరకు రూ.30 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేస్తారన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో రూ.172 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి, పనులను మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారని డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ వివరించారు.

సమావేశంలో రైల్వే బోర్డు సభ్యుడు షేక్ ఫరీద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండప్ప, నాయకులు పాల్గొన్నారు.



జహీరాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శరత్

## మంత్రి పర్యటనకు ఏర్పాట్లు

- జహీరాబాద్‌లో సభా స్థలాన్ని పరిశీలించి కలెక్టర్ శరత్

జహీరాబాద్, అక్టోబర్ 5 : రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు పర్యటన ఏర్పాట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో చేయాలని కలెక్టర్ శరత్ సూచించారు. గురువారం సాయంత్రం జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న సభా స్థలాన్ని పరిశీలించి, ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 7న మంత్రి హరీశ్‌రావు పర్యటన ఉన్నదని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సభ స్థలం వద్ద లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధికి సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులు, గృహలక్ష్మి లబ్ధిదారులతోపాటు వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పంపిణీ, శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ వెంట రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ తన్వీర్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీవో సురేశ్, ఆర్డీవో వెంకారెడ్డి, డీఎస్పీ రఘు, ఎంపీడీవో సుమతి, సీఐ రాజు, ఎస్. శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

## సింగూరుకు కొనసాగుతున్న వరద



నీటితో కళ కళ లాడుతున్న సింగూరు ప్రాజెక్టు

పుల్కల్, అక్టోబర్ 5 : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు సింగూరు ప్రాజెక్టు పూర్తిగా నిండింది. ప్రాజెక్టులోకి కొనసాగుతున్న వరద తీవ్రతను బట్టి నీటి పారుదలశాఖ అధికారులు విద్యుత్ ఉత్పత్తికి 2706 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 29.768 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పూర్తిస్థాయి నీటి మట్టం 523.600 మీటర్లకు 523.575మీ ఉందని ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టులో వరద ఎక్కువైతే నీటిని దిగువకు వదులుతామని డిప్యూటీ డీఈ నాగరాజు తెలిపారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మల్కాపూర్ గ్రామస్తులు



తూప్రాన్‌లో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి, చైర్మన్ రాఘవేందర్ గౌడ్

## సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తూప్రాన్, అక్టోబర్ 5 : సీఎం కేసీఆర్‌కు మహిళలందరూ రుణపడి ఉంటారని మల్కాపూర్ సర్పంచ్ మహాదేవి నవీన్, ఎంపీటీసీ పంజాల వెంకటమ్మ, ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు. గురువారం గృహలక్ష్మి పథకంలో ఎంపికై లబ్ధిదారులకు ఆర్థికసాయం మంజూరు పత్రాలను అందజేశారు. మొదటి విడతలో మల్కాపూర్ గ్రామంలో 56 మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలతోపాటు బతుకమ్మ కానుకగా రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన చీరలను మహిళలకు అందజేశారు. యవతకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి మల్కాపూర్ గ్రామస్తులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎవరెన్ని చెప్పినా మల్కాపూర్ ప్రజలంతా కేసీఆర్ వెంటే ఉంటూ, గతంలో కంటే భారీ మెజార్టీ ఇస్తామని తెలిపారు.

**తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో...**

తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆర్డీవో జయచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ తదతరులు మహిళలకు బతుకమ్మ చీరలు, గృహలక్ష్మి పథకం ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. మహిళలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మోహన్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## షీ-టీమ్స్‌తో మహిళలకు భద్రత

- వేధిస్తే కఠిన చర్యలు
- అదనపు ఎస్పీ అశోక్



విద్యార్థినులతో షీ-టీమ్స్ బృందం సభ్యులు

సంగారెడ్డి, అక్టోబర్ 5 : మహిళల భద్రతకు పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తున్నదని, ముఖ్యంగా ఈవ్ టీజింగ్‌పై షీ-టీమ్ బృందాలు ప్రత్యేక నిఘాతో పర్యవేక్షిస్తారని అదనపు ఎస్పీ అశోక్ తెలిపారు. జిల్లాలోని పోలీస్ సబ్ డివిజన్లలో ఏర్పాటు చేసిన షీ-టీమ్స్ బృందాలకు ప్రత్యేక నిఘాపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో షీ-టీమ్స్ బృందాలు గత నెలలో 4- కౌన్సెలింగ్, 9 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, 50-హాట్ స్పాట్లను సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ సబ్ డివిజన్లవారీగా ఏర్పాటు చేసిన షీ-టీమ్స్ బృందాలు నిరంతరంగా పాఠశాలలు, కళాశాలలు, బస్‌స్టాండ్, రద్దీ ప్రాంతాలు, పని ప్రదేశాల్లో నిఘా వేస్తూ ఈవ్‌టీజింగ్, ఉమెన్ ట్రాఫికింగ్, భిక్షాటన, సైబర్ క్రైమ్స్‌పై వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను చైతన్య పరుస్తున్నారన్నారు. మహిళలనే వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు ఆపద సమయంలో 8712656772 లేదా 100 నంబర్లకు ఫోన్ లేదా మెజేస్ సమాచారం ఇవ్వాలని సూచించారు.